ఆకాశవాణి : హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

జాతీయ వార్తలు

తేదీ: 26.09.2024 సాయంత్రం 19.05 గంటలు

ముఖ్యాంశాలు

1. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఈ సాయంత్రం వాతావరణ సమాచారం అందజేసే మూడు 'పరంరుద్ర సూపర్ కంప్యూటింగ్ వ్యవస్థలను' ప్రారంభించారు.

2. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ రోజు సియాచిన్ బేస్ క్యాంప్ ను సందర్శించి.. సైనికులు, సైనికాధికారులను కలిసి ముచ్చటించారు.

3. లెబనాన్ లో ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడుల్లో 6 వందల మందికి పైగా మృతి చెందారు.

4. మకావు ఒపెన్ బ్యాడ్మింటన్ పురుషుల సింగిల్స్ ప్రీ క్వార్టర్ ఫైనల్ లో ఈ రోజు భారత మేటి క్రీడాకారుడు సిద్ధార్థ్ శ్రీకాంత్, మహిళ డబుల్స్ 16వ రౌండ్ లో గాయత్రి గోపిచంద్, ట్రిస్సా జోలి జంట విజయం సాధించారు.

**PM PARAM SUPERCOMPUTER**

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఈ రోజు సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వాతావరణ సమాచారం అందజేసే మూడు పరంరుద్ర సూపర్ కంప్యూటింగ్ వ్యవస్థలను, అత్యున్నత ప్రతిభ కనబరిచే కంప్యూటింగ్ సిస్టమ్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధాన మంత్రి మాట్లాడుతూ.. శాస్త్ర సాంకేతిక రంగంలో మన దేశం వినూత్న ఆవిష్కరణలతో, కంప్యూటింగ్ లో స్వయంసమృద్ధం సాధన దిశగా ముందుకు వెళ్తోందని అన్నారు. డిజిటల్ విప్లవ యుగంలో జాతీయ సమర్థతకు కంప్యూటింగ్ సామర్థ్యం

ప్రత్యమ్నాయం అవుతుందని అన్నారు. ఈ ఆవిష్కరణలతో మనదేశం శాస్త్ర సాంకేతిక ప్రపంచంలో ఒక గొప్ప విజయం సాధించిందని అన్నారు. 21వ శతాబ్దంలో భారత దేశం శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం, పరిశోధనలతో ఎలా ముందుకు వెళ్తుందో ఈ ఆవిష్కరణ స్పష్టం చేస్తోందని నరేంద్ర మోదీ అన్నారు. జాతీయ సూపర్ కంప్యూటింగ్ మిషన్ కింద 130 కోట్ల  రూపాయల వ్యయంతో దేశీయ పరిజ్ఞానంతో పుణె, ఢిల్లీ, కోల్ కతా లోని శాస్త్రీయ పరిశోధన కేంద్రాలలో  ఈ మూడు పరంరుద్ర సూపర్ కంప్యూటర్ లను తయారు చేశారు.

NSD

**PRESIDENT SIACHEN GLACIER VISIT**

రాష్ట్రపతి ద్రౌపది ముర్మ ఈ రోజు సియాచిన్ బేస్ క్యాంప్ ను సందర్శించి.. సైనికులు, సైనికాధికారులను కలిసి ముచ్చటించారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి మాట్లాడుతూ.. కఠినమైన వాతావరణ పరిస్థితులను లెక్క చేయకుండా దేశ రక్షణ కోసం సేవలందిస్తున్న సైనికుల ధైర్య సాహసాలను కొనియాడారు. సియాచిన్ గ్లేసియర్ వద్ద నియుక్తులైన సైనికుల కుటుంబాలకు, బంధువులకు రాష్ట్రపతి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ద్రౌపది ముర్మ సియాచిన్ బేస్ యుద్ధ స్మారకం వద్ద అమరవీరులకు పుష్ప గుచ్ఛంతో నివాళులర్పించారు. మాజీ రాష్ట్రపతులు ఏపీజే అబ్దుల్ కలాం, రామ్ నాథ్ కోవింద్ తర్వాత సియాచిన్ బేస్ క్యాంప్ ను సందర్శించిన మూడవ రాష్ట్రపతి ద్రౌపది ముర్మ అయ్యారు. ప్రపంచంలో అత్యంత ఎత్తున్న మిలిటరీ పహారా ప్రాంతం అయినా కరకోరం, రేంజ్ లో ఉన్న సియాచిన్ గ్లేసియర్ ను 1984 ఏప్రిల్ నుంచి భారత్ సైన్యం ఆపరేషన్ మేఘ్ దూల్ పేరిట పహారా కాస్తోంది.

NSD

**PM HARYANA**

హర్యానా ప్రజలు భారతీయ జనతా పార్టీకి అధికారం అప్పగిస్తారని తనకు విశ్వాసం ఉందని బీజేపీ

సీనియర్ నేత, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. హర్యానా బీజేపీ బూత్ కార్యకర్తలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నరేంద్ర మోదీ మాట్లాడుతూ.. రాష్ట్రంలో అవినీతి రహిత పరిపాలనను బీజేపీ అందిస్తుందని అన్నారు. ఎటువంటి అవినీతి మార్గంతో  పనిలేకుండా రాష్ట్ర యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలను అందిస్తున్నామని అన్నారు. ఈ సందర్భంగా నరేంద్ర మోదీ కాంగ్రెస్ పార్టీని విమర్శిస్తూ.. ఆ పార్టీ వర్గ పోరాటం, అంతర్గత కుమ్ములాటలు, ఆ తర్వాత రాజీల ఉచ్చులో చిక్కుకుపోయిందని విమర్శించారు.

NSD

**RAHUL RALLY**

హర్యాణ కర్నాల్ జిల్లాలో అసంద్ శాసనసభ నియోజకవర్గంలో ఈ రోజు కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ విజయ్ సంకల్ప్ యాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో నిరుద్యోగం, రైతుల కనీస మద్దతు ధర సమస్యలకు.. బీజేపీదే బాధ్యతన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగంతో యువత బాధపడుతున్నారని రైతులు కనీస మద్దతు ధర లేక ఇక్కట్ల పాలయ్యారని ఆరోపించారు. రైతులకు రుణమాఫీ ఇవ్వడంలో బీజేపీ ప్రభుత్వం విఫలమైందన్నారు. కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలని ముఖ్యాంశాలను వివరిస్తూ.. రాహుల్ గాంధీ రాష్ట్ర ప్రజలకు కాంగ్రెస్ పార్టీ 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ను, మహిళలకు 2000 రూపాయల చొప్పున పింఛన్లు అందిస్తుందన్నారు. హర్యానా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఉదయ్ భాను, మాజీ ముఖ్యమంత్రి భూపేంద సింగ్ హుడా, కాంగ్రెస్ ఎంపీ కుమారి సెల్జా తదితర సీనియర్ నేతలు పాల్గొన్నారు.

NSD

EVE VICE PREZ CSIR

పరిశోధన అభివృద్ధికి నిధులు కేటాయించడం ప్రయోజనం లేదని ఈ నిధులను సత్ ఫలితాల కోసం

సద్వినియోగం చేయాలని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్ ఖడ్ అన్నారు. కొత్త ఢిల్లీలో ఈరోజు 43వ సీఎస్ఐఆర్ వ్యవస్థాపక దినోత్సవంలో దన్ ఖడ్ మాట్లాడుతూ.. సమాకాలీన సమాజంలో పరిశోధన అభివృద్ధికి ఎంతో ప్రాముఖ్యత ఉందని తెలిపారు. పరిశోధన అభివృద్ధి అనేది సున్నితమైన దౌత్యం, జాతీయ భద్రతలు అంతర్భాగమని స్పష్టం చేశారు. పరిశోధన అభివృద్ధిలో పెట్టుబడులు పెట్టాలని ఆయన కార్పొరేట్ సంస్థలకు పిలుపునిచ్చారు. ఏ దేశమైన ఎదగాలన్న శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం వృద్ధి చోధకంగా పనిచేస్తోందని ఉపరాష్ట్రపతి తెలిపారు. ఈ సందర్భంగా ధన్ ఖడ్.. NASC కాంప్లెక్స్ లో సీఎస్ఐఆర్ ఇతివృత్త 2024 ఎగ్జిబిషన్ ను ప్రారంభించారు.

NSD

**KARNATAKA-GADKARI**

నాణ్యతను పెంపొందించి, నిర్మాణాన్ని వేగిరపరిచి, ప్రాజెక్టుల వ్యయం తగ్గించడానికి ప్రత్యామ్నాయ మెటీరియల్ లు, నూతన ఆవిష్కృత వ్యర్థాల నుంచి సంపద సాంకేతిక పరిజ్ఞానం, ఉత్తమ పద్ధతులను అవలంభించాలని రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. కర్ణాటకలో ఈరోజు వంతెనలపై జరిగిన అంతర్జాతీయ సదస్సులో కేంద్రమంత్రి మాట్లాడుతూ.. ప్రాజెక్టు అనుమతుల్లో డిజిటల్ నిర్వహణ వ్యవస్థ సత్వర ఆమోదాలను అందిస్తుందని అన్నారు. వర్గీకరించిన మున్సిపల్ వ్యర్థాలు, బూడిద, ప్లాస్టిక్, రబ్బరు, వెదురును రోడ్డు నిర్మాణంలో, వంతెనల నిర్మాణంలో వాడే ప్రీకాస్ట్ స్టక్చర్ లలో ఉపయోగించాలని సూచించారు. ఇందువల్ల నిర్మాణ వ్యయం తగ్గి.. నిర్మాణ ప్రక్రియ వేగవంతం అవుతుందని అన్నారు. భారత రోడ్ల కాంగ్రెస్, పీఐఏ ఆర్ సీ, కర్ణాటక పీడబ్ల్యూ డిపార్ట్ మెంట్ సంయుక్తంగా ఈ సదస్సును నిర్వహించాయి.

Nsd

**EVE LEBANON-ISRAEL**

లెబనాన్ లో ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడుల్లో 6వందల మందికి పైగా చనిపోయారు. ఈ

దాడులకు ప్రతీకారంగా ఉగ్రవాద సంస్థ హెజ్ బుల్లా కూడా ఇజ్రాయెల్ పై  రాకెట్ దాడులు జరిపింది. అయితే ఇజ్రాయెల్ లెబనాన్ సరిహద్దుల్లో వెంటనే 21 రోజుల కాల్పుల విరమణ పాటించాలని అమెరికా, ఫ్రాన్స్, ఇతర మిత్రపక్షాలు నిన్న పిలుపునిచ్చాయి. ఇలా ఉండగా.. పూర్తి శక్తి సామర్థ్యాలతో పోరాటం కొనసాగించాలని ఇజ్రాయెల్ రక్షణ దళాలను ఆదేశించినట్లు ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమన్ నెతన్యాహు కార్యలయం ప్రకటించింది. అంతకుముందు బీరూట్ లోని భారత రాయబార కార్యాలయం ఒక సూచన ఇస్తూ.. తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు లెబనాన్ కు ప్రయాణాలు చేయవద్దని ఇజ్రాయెల్, హెజ్ బుల్లా మధ్య ఘర్షణను దృష్టిలో పెట్టుకుని అక్కడి నుంచి వెళ్లిపోవాలని భారత పౌరులకు సూచించింది. భారత పౌరులు ఎవరైనా ఒకవేళ ఏదైనా కారణం చేత అక్కడే ఉండావలసి వస్తే అత్యంత అప్రమత్తతను పాటిస్తూ.. తమ కదలికలను పరిమితం చేసుకోవాలని రాయబారం కార్యాలయం సూచించింది.

NSD

**INDIA INDONESIA**

భారత ఇండోనేషియా విదేశాంగ కార్యాలయ 8 వ విడత సంప్రదింపులు ఈ రోజు కొత్త ఢిల్లీలో జరిగాయి. రాజకీయ మార్పిడిలు, రక్షణ, భద్రత, ప్రాదేశిక జలాలు, సముద్రయానం, వాణిజ్యం, పెట్టుబడులు, ఆరోగ్య రక్షణ, అనుసంధానంతో పాటు ద్వైపాక్షిక సంబంధాలను ఇరుపక్షాలు సమగ్రంగా సమీక్షించాయి. పరస్పర ఆసక్తిగల ప్రాంతీయ,  అంతర్జాతీయ అంశాలపై అభిప్రాయాలను పంచుకున్నాయి. భారత ఇండోనేషియా దౌత్య సంబంధాలను నెలకొల్పి 75 సంవత్సరాలు గడిచిన సందర్భంగా నిర్వహించనున్న అనేక కార్యక్రమాలపై వారు చర్చించారు. భారత ప్రతినిధి బృందానికి తూర్పు దేశాల కార్యదర్శి జయదీప్ ముజుందార్ నాయకత్వం వహించారు.

NSD

INDIA-MAURITIUS

భారత ఉన్నతస్థాయి ప్రతినిధి బృందం  మారిషియస్ పర్యటన నిన్న ముగిసింది. ఈ సందర్భంగా వ్యూహాత్మక సమావేశాలు, ఫల ప్రదమైన చర్చలు జరిపారు. మూడ్రోజుల పాటు జరిపిన ఈ పర్యటనలో ద్వైపాక్షిక సహాకారాలు మరింత పెంపొందించేందుకు అవసరమైన ప్రణాళికలపై, సామర్థ్య పెంపు కార్యక్రమాలు తదితర అంశాలపై చర్చించారు. భారత ప్రతినిధి బృందానికి విదేశాంగ శాఖ కార్యదర్శి వి. శ్రీనివాస్ మారిషియస్ ప్రతినిధి బృందానికి ఆ దేశ ప్రజాసేవ శాఖ కార్యదర్శి కె.కోసె ప్రాతినిధ్యం వహించారు. ఈ పర్యటనలో పీఎం గతిశక్తి, జెమ్, వుడాయ్ కార్యక్రమానికి చెందిన నిపుణులతో మారిషియస్ ప్రతినిధి బృందం చర్చలు జరిపింది.

NSD

**J&K-AMIT SHAH**

**దేశంలో తీవ్ర**వాదం భూస్థాపితం అయిందని మళ్లీ పుట్టే ప్రసక్తే లేదని బీజేపీ సీనియర్ నేత, కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. జమ్మూకాశ్మీర్ లోని ఉధంపూర్ జిల్లాలో చైనాని ప్రాంతంలో ఎన్నికల ర్యాలీలో అమిత్ షా మాట్లాడుతూ.. 370 అధికరణాన్ని రద్దు చేయడం ద్వారా  ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం బీజేపీ వ్యవస్థాపకులు శ్యామ ప్రసాద్ ముఖర్జీ స్వప్నాన్ని సాకారం చేసిందని అన్నారు. ఉధంపూర్, కత్వా , జమ్మూ జిల్లాల్లో ఆయన ఈరోజు ఐదు ఎన్నికల ర్యాలీలో ప్రసంగించవల్సి ఉంది. శాసన సభ ఎన్నికల చివరి విడతలో జమ్మూలో 24 అసెంబ్లీ నియోజకవర్గాలు, కాశ్మీర్ డివిజన్ లో 16 నియోజకవర్గాలు ఉన్నాయి.

NSD

**EVE BADMINTON-MACAU OPEN**

మకావు ఒపెన్ బ్యాడ్మింటన్ పురుషుల సింగిల్స్ ప్రీ క్వార్టర్ ఫైనల్ లో ఈ రోజు భారత మేటి క్రీడాకారుడు సిద్ధార్థ్ శ్రీకాంత్ తన తోటి క్రీడాకారుడు ఆయుష్ శెట్టిని 21-13, 21-18 తేడాతో ఓడించి ముందుకు దూసుకెళ్లాడు. కాగా, మహిళల డబుల్స్ లో ఈరోజు 16వ రౌండ్ లో  భారత్ మూడవ సీడ్ లు గాయత్రి గోపి చంద్, ట్రిస్సా జోలి జంట తైవాన్ జంట లిన్ చీ- చున్, పెంగ్ చున్ శున్ జంటను 22-20, 21-11 తేడాతో ఓడించారు. అలాగే మహిళల సింగిల్స్  ప్రీ క్వార్టర్ మ్యాచ్ లో భారత క్రీడాకారిణి తస్నిమ్ మీర్ ను జపాన్ కు చెందిన టోమోకా మియాజాకి చేతిలో 17-21, 21-13, 10-21 స్కోర్ తో ఓడిపోయారు.

NSD